క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని దేవరకద్ర డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్, రసాయనశాస్త్రం, ఆర్థికశాస్త్రం, చరిత్ర సబ్జెక్టులు బోధించడానికి ఆసక్తిగల అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల వారు శనివారం కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

పోలీస్ పోర్టల్‌లో నమోదు తప్పనిసరి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసే ప్రతిఒక్కరూ పోలీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో బుధవారం నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్లపై, విగ్రహాలు ఏర్పాటు చేయరాదని, వలంటీర్లు భక్తులను తనిఖీ చేసి మండపాల్లోకి పంపించాలన్నారు. మండపాలను నాణ్యతతో కూడిన వస్తువులతో నిర్మించుకోవాలని, పటాకులు, మందుగుండు సామగ్రి పెట్టరాదన్నారు. డీజేలకు అనుమతి లేదని, పాఠశాలలు, ఆస్పత్రులకు ఇబ్బంది కలిగేలా సౌండ్స్ పెట్టరాదన్నారు. నిమజ్జనం సందర్భంగా ప్రతి వాహనం కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలని, డీఎస్పీ అధికారి ఇచ్చిన సీరియల్ నంబర్ స్టిక్కర్ వాహనానికి అతికించాలన్నారు. ఊరేగింపుల్లో మద్యం తాగడం, బాణాసంచా కాల్చడం వంటివి చేయరాదన్నారు. సమావేశంలో టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవరకద్ర: గణేశ్ వేడుకల కోసం ఏర్పాటు చేసే మండపాల నిర్వహణలో భద్రత నియమాలు పాటించాలని ఎస్‌ఐ నాగన్న కోరారు. దేవరకద్ర పోలీసు స్టేషన్ ఆవరణలో గణేశ్ మండపాల నిర్వాహకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల నిర్వహణ బాధ్యత నిర్వాహకులదే అని ప్రతి మండపం వద్ద సీసీ కెమెరా తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో, మండలంలోని గ్రామాల గణేశ్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నవాబుపేట: శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్‌ఐ విక్రమ్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి ఆవరణలో మొక్క నాటాలి

భూత్పూర్: ప్రతి ఇంటి ఆవరణలో విధిగా మొక్క నాటాలని మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో వనమహోత్సవం నిర్వహించారు. మొక్కలు నాటడంతో వాతావరణ కాలుష్యంలో మార్పు జరుగుతుందని, కాలుష్యం పారదోలడానికి ప్రతి ఒక్కరు మొక్కను నాటాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు విజయ్‌గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఖదీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పూటకో మాట మార్చడం సీఎం నైజం

మహబూబ్‌నగర్ రూరల్: ఉప రాష్ట్రపతి జగదీప్ దన్కర్ రాజీనామా చేసిన తొలిరోజు కేంద్ర ప్రభుత్వం బీసీ సామాజిక వర్గానికి చెందిన బండారు దత్తాత్రేయను ఉప రాష్ట్రపతిగా నియమించాలని పలు కార్యక్రమాలలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ అన్నారు. ఇప్పుడు ఇండియా కూటమి అభ్యర్థిగా సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేయడం వెనక ఆయనకు బీసీలపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. బుధవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురభి విజయ్‌కుమార్, నరేష్‌చారి పాల్గొన్నారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

మిడ్జిల్: మండలంలోని వల్లభ్‌రావుపల్లి గ్రామానికి చెందిన అజ్జుమాబేగం(35) కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స అందించారు. వారం రోజుల క్రితం ఇంటికి తీసుకొచ్చారని ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. అప్పటి నుంచి నేను చనిపోతానని కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురి చేస్తూ, బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందింది. ఆమె సోదరుడు గులాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

25న ధర్నాను జయప్రదం చేయండి

మిడ్జిల్: ఆశా వర్కర్ల సమస్యలపై 25న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి కృష్ణకుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాకు మండలంలోని ఆశా కార్యకర్తలు విధిగా హాజరుకావాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు జగన్ కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శోభారాణి, లక్ష్మి, శారద, అంజమ్మ పాల్గొన్నారు.

కోడ్గల్‌లో ఘనంగా తీజ్ ఉత్సవాలు





మండలంలోని గిరిజన గురుకుల బాలికల విద్యాలయంలో బుధవారం వైభవంగా తీజ్ ఉత్సవాలు నిర్వహించారు. ఈనెల 12న మొదలైన ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ట్రైబల్ హెరిటేజ్ అండ్ కల్చరల్ కార్యక్రమంలో భాగంగా గిరిజన సంప్రదాయ ఉత్సవాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రజనిరాగలత తెలిపారు. ఈ నెల 12న తీజ్ ఉత్సవం కోసం విద్యార్థినులు వెదురుబుట్టల్లో గోధుమ గింజలను వేసి ప్రతిరోజు నిష్ఠతో ఉపవాసదీక్షతో పూజలు చేశారన్నారు. ఆ మొలకలను బుధవారం ఊరేగించి దుందుభిలో నిమజ్జనం చేశామన్నారు. విద్యార్థినులు గిరిజన సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా ముగించినట్లు వెల్లడించారు. –జడ్చర్ల టౌన్



తీజ్ బుట్టలతో ఊరేగింపు

ప్రభుత్వం విద్యకు పెద్దపీట



చిన్నచింతకుంటలో స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలోని ఎంఎస్ గార్డెన్‌లో నిర్వహించిన టీచింగ్, లర్నింగ్, మెటీరియల్ మేళకు ఎమ్మెల్యే హాజరై విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను తిలకించారు. అంతకుముందు కౌకుంట్ల మండలం ముచ్చింతలలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. చిన్నచింతకుంటకు ఇంటిగ్రేటెడ్ పాఠశాల, మరియు ఐటీఐ కళాశాల, జూనియర్ కళాశాల మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో అరవింద్‌కుమార్ రెడ్డి, కురుమూర్తి స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ మాజీ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్, వట్టెంశివ ఉన్నారు.

హాకా కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

దేవరకద్ర: మున్సిపాలిటీ కేంద్రంలో బుధవారం హైదరాబాద్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ అసోసియేషన్ ఎరువుల కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులకు కావలిసిన నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, మందులు అందించేందుకు హాకా కేంద్రాలు పని చేస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.

చెక్‌డ్యామ్ కొట్టుకుపోయినట్లు నిరూపించాలి

దేవరకద్ర: అడ్డాకుల మండలం రాచాల వద్ద చెక్‌డ్యామ్ కొట్టుకు పోయినట్లు కేటీఆర్ నిరూపించాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సవాల్ విసిరారు. రాచాల వద్ద చెక్ డ్యామ్ కొట్టుకు పోయినట్లు కేటీఆర్ వాస్తవాలు తెలుసుకోకుండా ప్రభుత్వంపై బురదజల్లే ఉద్దేశ్యంతో అవస్తవాలను ప్రచారం చేస్తున్నాడని కేటీఆర్‌పై ఎమ్మెల్యే మండి పడ్డారు. దమ్ముంటే కేటీఆర్ చెక్ డ్యామ్ కొట్టుకు పోయినట్లు నిరూపించాలని, లేని పక్షంలో ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు

భూత్పూర్: మండలంలోని కొత్త మొల్గర, ఎల్కిచర్లలో బుధవారం శ్రీ కృష్ణుడి ప్రతిమను ఊరేగింపు నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ప్రతిష్ఠించి 5 రోజుల పాటు ఘనంగా పూజలు చేశారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి– ఇందూ జ్ఞాన వేదిక కొత్త మొల్గర, ఎల్కిచర్ల గ్రామాలలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మద్దిగట్ల కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్రచారి, రమేష్, సుదర్శన్, కొత్తకోట కమిటీ సభ్యులు నరేందర్, శైలజ, రాము, వనపర్తి కమిటీ సభ్యులు శివమ్మ, మహేష్, వెంకట్రాములు, మహబూబ్‌నగర్ కమిటీ సభ్యులు నాగ్యానాయక్, శ్రీనివాస్, వెంకటేష్, పెబ్బేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

4వ మహాసభలు జయప్రదం చేయండి

జడ్చర్ల టౌన్: మున్సిపల్ 4వ పట్టణ మహాసభలను జయప్రదం చేయాలని మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్ పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న కార్మికుల వద్దకు రాష్ట్ర కమిటీ సూచనల మేరకు స్థానిక కెంచ లింగమణెమ్మ ఫంక్షన్‌హాల్లో మహాసభలు జరుగుతున్నాయని వెల్లడించారు. సభల్లో భాగంగా సిగ్నల్‌గడ్డ నుంచి కార్మికులతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



మహమ్మదాబాద్: మాజీ దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీపీ శాంతిరంగ్యా పేర్కొన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ 81వ జయంతి సందర్భంగా మహమ్మదాబాద్ మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పులమాలలు వేశారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడంతో పాటు పలు దీర్ఘకాలిక పనులు ఎన్నో చేపట్టారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకుడు అనంతయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముకుందం, మాజీ కోఆప్షన్ రహీం, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అక్బర్, కాంగ్రెస్ మండల కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: భారత మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయమని జడ్చర్ల మాజీ ఎంపీపీ నిత్యానందం అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, మండల అధ్యక్షులు వెంకటయ్య, మాజీ సర్పంచ్ వెంకటేశం, మండల నాయకులు మినాజ్, వంశీచారి, వంశీ, రఘు, ఖాజాపాష, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

లక్షబిల్వార్చన

నవాబుపేట: భద్రకాళిసహిత వీరభద్రస్వామి లక్షబిల్వార్చన కార్యక్రమం వైభవంగా కొనసాగింది. బుధవారం మండలంలోని లోకిరేవు గ్రామంలో వీరభద్రస్వామి లక్ష బిల్వార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ పీఠాధిపతి లింగయ్యస్వామి ఆధ్వర్యంలో లక్ష మారేడు పత్రి దళాలతో వీరభద్రస్వామికి పూజలు చేశారు. అనంతరం అన్నదాన ఏర్పాటు చేశారు. వీరభద్ర స్వామి దేవాలయంలో అమవాస్య రోజు రుద్రాభిషేకం చేసి శ్రావణమాస పూజలు ముగిస్తారు.

అభివృద్ధి పనులు అడ్డుకుంటే ఊరుకోం..



రాజాపూర్‌లో లబ్ధిదారులకు కొత్తరేషన్‌కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: జడ్చర్ల నియోజకఅభివృద్ధిని ఎవరైనా అడ్డుకోవాలని చూస్తే ఎంతటి వారైనా ఊరుకునే ప్రసక్తి లేదని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం రాజాపూర్ మండల కేంద్రంలోని జేకే ఫంక్షన్‌హాల్లో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏదో లబ్ధి కోసం రాజకీయాల్లోకి రాలేదని, జడ్చర్ల అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి చేస్తున్నామని, అందుకు కావాల్సిన నిధులను సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి తీసుకొస్తున్నట్లు తెలిపారు. మండలంలో రూ.45 కోట్లతో ఈద్గాన్‌పల్లిలో ట్రయినింగ్ సెంటర్ మంజూరు చేయించుకోవడం జరిగిందన్నారు. నవోదయ పాఠశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తెచ్చుకోడం జరిగిందన్నారు. గతంలో రంగారెడ్డిగూడ దేవాలయ భూములను అమ్ముకోవాలని మాజీ జెడ్పీటీసీ చూస్తే ఘాటుగా సమాధానం చెప్పానన్నారు. జిల్లాలో 25వేల కొత్తరేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు 91040ని కొత్తగా యాడ్ చేయడం జరిగిందన్నారు. మండలంలో 433 కొత్త రేషన్ కార్డులు రావడం జరిగిందన్నారు. 2100 మంది కొత్తగా యాడ్ చేయడం జరిగిందన్నారు. అనంతరం మల్లేపల్లి, రాజాపూర్, చెన్నవెల్లి, తిర్మలాపూర్, కుచ్చర్కల్ గ్రామాల్లో సీసీరోడ్లకు, అండర్ డ్రయినేజీలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాధాకృష్ణ, ఎంపీడీఓ విజయలక్ష్మి, మార్కెట్ వైస్ చైర్మన్ శేఖర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలో వారం రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. వరద నీటి ఉధృతికి మండలంలోని ఫతేపూర్‌లో మాదిగోనికుంటకు గండి పడింది. ఈ విషయాన్ని ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచన మేరకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి ఫతేపూర్ గ్రామానికి చేరుకుని గండి పడిన కుంటను, వరద నీటికి దెబ్బతిన్న రైతుల పొలాలను పరిశీలించారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే మరమ్మతు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు నర్సింహారెడ్డి తెలిపారు.

జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలి



మాదిగోనికుంట గండిని పరిశీలిస్తున్న మల్లు నర్సింహారెడ్డి

విద్యార్థులు మంచిగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని ఫతేపూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఫండరినాథ్, గోవింద్‌యాదవ్, నాయకులు నరేష్, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి



మాట్లాడుతున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

భూత్పూర్: విద్యార్థులలో కనీస సామర్థ్యాలను సాధించి, గుణాత్మక విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం అడ్డాకుల మండల కేంద్రంలో బోధన, అభ్యసన సామగ్రి మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు చక్కటి విద్యను అందించాలని, అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. టీఎల్‌ఎం మేళాలో విస్తృతంగా బోధనోపకరణలను ప్రదర్శించిన ఉపాధ్యాయులను డీఈఓ అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డి. శ్రీనివాస్, తహసీల్దార్ శేఖర్, ఎంఈఓ కురుమూర్తి, కాంప్లెక్స్ హెచ్ఎంలు జ్యోతి, రామలింగం, ప్రకాష్, టీటీయూ జుర్రు నారాయణ, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, బీటీఎఫ్ బాలశంకర్, పీఆర్‌టీయూ శ్రీధర్ గౌడ్, వివిధ సంఘాల నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిమాత బోనాలు

నవాబుపేట: మండల పరిధిలోని యన్మన్‌గండ్ల గ్రామంలో చౌడమ్మ దేవతకు యన్మన్‌గండ్ల, నవాబుపేట, రుక్కంపల్లి, దయాపంతులపల్లి, సీతమ్మ తండా, తూక్యతండా గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. బోనాల ఊరేగింపు నిర్వహించారు.

మిడ్జిల్: మండల కేంద్రంతో పాటుగా మసిగొండ్లపల్లి గ్రామంలో గ్రామ దేవత పోచమ్మ, మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఎద్దుల బండ్లను, ట్రాక్టర్లను అలంకరించి ఆలయాల చుట్టు ప్రదక్షిణలు చేశారు.



మిడ్జిల్ మండల పరిధిలోని మసిగొండ్లపల్లి గ్రామంలో బోనాలతో వెళ్తున్న మహిళలు

హాకా నిర్వాహకుల దోపిడీ

- ప్రారంభం రోజునే యూరియా అధిక ధరకు విక్రయాలు
- ఆందోళన చెందుతున్న రైతులు



హాకా సెంటర్ వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

దేవరకద్ర రూరల్: ప్రారంభించిన మొదటి రోజు హాకా రైతు సేవా కేంద్రం నిర్వాహకులు యథేచ్ఛగా దోపిడీకి తెర లేపారు. ప్రభుత్వం అందించే ఎరువులను బయట అధిక ధరలకు కొని నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం హాకా సెంటర్లకు అనుమతి ఇచ్చింది. అందులో భాగంగానే దేవరకద్రలో కొత్తగా 3 హాకా సెంటర్లు ఏర్పాటు చేశారు. అందులో రెండు సెంటర్లను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. బస్టాండ్ సమీపంలోని హాకా సెంటర్ 2 నిర్వాహకులు ప్రారంభం రోజే దోపిడీకి తెర లేపారు. ప్రస్తుత రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని రూ.266కు విక్రయించాల్సిన యూరియాను రూ.300కు విక్రయించారు. గత్యంతరం లేక కొందరు రైతులు కొనుగోలు చేయగా, పలువురు రైతులు వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో నిర్వాహకులపై ఏఓ రాజేందర్ అగర్వాల్ ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ధరకే విక్రయించాలని, రైతుల నుంచి తీసుకున్న డబ్బులను వెనక్కి ఇవ్వాలని ఆదేశించారు. అయినప్పటికీ నిర్వాహకుల తీరు మార్చుకోలేదు. అనంతరం సదరు అధికారి మళ్లీ ఫోన్ చేసి హెచ్చరించడంతో మిగతా రైతులకు యూరియా ఇవ్వకుండా రేపు రావాలని వర్షంలోనే వెనక్కి పంపించారు.

పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

జడ్చర్ల టౌన్: భవిత కేంద్రం ద్వారా మానసిక దివ్యాంగుల ప్రయోజనార్థం అందిస్తున్న పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం జడ్చర్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉపకరణాల గుర్తింపు, నిర్ధారణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భవిత ద్వారా ఇప్పటికే కొంతమందికి అనేక పరికరాలు ఇవ్వటం జరిగిందని, వాటిని వినియోగించకపోవటం వల్ల సరైన ఫలితాలు రాలేదన్నారు. ఓ విద్యార్థిని కుడికాలు బాగాలేకపోవటం వల్ల అందుకు తగినట్లుగా ఫిజియోథెరపీ చేయించుకోకపోవటం, ఇచ్చిన పరికరం వాడకపోవటం వల్ల మరోకాలుకు ఇబ్బంది అయ్యిందన్నారు. ఇప్పుడు రెండు కాళ్లకు ఫిజియోథెరపీ చేయాల్సి వస్తుందని, రెండు కాళ్లకు షూ ఇవ్వాల్సి వస్తుందన్నారు. అందుకే ఇచ్చిన పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి, ఫిజియోథెరపీ వైద్యులు తుషార్‌వర్మ, సుప్రోజ్‌లు పాల్గొన్నారు.



శిబిరంలో చిన్నారికి పరీక్ష చేస్తున్న ఫిజియోథెరపీ వైద్యులు, డీఈఓ, ఎంఈఓలు

సీపీఎస్‌ను వెంటనే రద్దుచేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ కోరారు. ఈమేరకు జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సీపీఎస్‌తో ఉద్యోగులకు ఎలాంటి భద్రత లేదని అన్నారు. 2004లోఎన్‌డీఏ ప్రభుత్వం కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు ప్రవేశపెట్టిన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయినా రద్దు కావడం లేదని విమర్శించారు. పెన్షన్ అనేది ప్రతి ఒక్క ఉద్యోగి హక్కు అని అలాంటి హక్కును ఉద్యోగికి లేకపోవడం దుర్మార్గమన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీహరికి వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

జడ్చర్ల: భారీ వర్షాల సమయంలో ప్రజలు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని జడ్చర్ల టీజీఎస్ పీడీసీఎల్ డీఈఈ చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తడిసిన కరెంట్ స్తంభాలను, విద్యుత్ లైన్ తగిలే చెట్లను, తడి చేతులతో స్విచ్ బోర్డులను, తెగిన వైర్లను ముట్టుకోవద్దని, వర్షం సమయంలో డిష్, ఫ్రిజ్, టీవీ కంప్యూటర్ వంటి వాటిని స్విచ్ ఆఫ్ చేయాలన్నారు. ఇళ్ల వద్ద ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలని, సర్వీస్ వైర్లను చెక్ చేసుకోవాలని, కరెంట్ లైన్ల కింద సెల్ ఫోన్ మాట్లాడకుండా తదితరజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): క్రిష్టియన్‌పల్లి ఫీడర్‌పై కొత్త స్తంభాలు వేస్తుండడంతో గురువారం పట్టణంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని రూరల్ ఏడీ మద్దిలేటి, ఏఈ నర్సిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 2గంటల వరకు క్రిష్టియన్‌పల్లి, ఆయోధ్య నగర్, ఉప్పెరి గుడిసెలు, శ్రీరామ కాలనీ, ఎంవీఎస్ డిగ్రీ కాలేజీ ఫాతిమా స్కూల్, మోటార్ లైన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

పొలిటికల్ సైన్స్‌లో డాక్టరేట్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రానికి చెందిన అనిత ఓయూలో పొలిటికల్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణన్ చేతుల మీదుగా అందుకున్నారు. డాక్టరేట్ సాధించిన అనిత తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కాలేజీలో పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ఆమెకు కాలేజీ ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి డాక్టరేట్

జడ్చర్ల: స్థానిక కావేరమ్మపేట జెడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న వ్యాయామ విద్యలో డాక్టరేట్ స్వీకరించినట్లు ఉపాధ్యాయురాలు శారద బాయి తెలిపారు. మంగళవారం జరిగిన ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ పొందినట్లు ఆమె పేర్కొన్నారు. పాలమూరు యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంత్ రాథోడ్ గైడ్ ఆధ్వర్యంలో పరిశోధన చేసి డాక్టరేట్ పొందినట్లు ఆమె తెలిపారు.

కోతకు గురైన రోడ్డు పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక శ్రీనివాసకాలనీలో చిక్కుడువాగు ఉధృతికి సమీపంలోని రోడ్డు కోతకు గురైంది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ బుధవారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. అంతకుముందు కృష్ణానగర్‌లో పర్యటించారు. అక్కడి వాటర్‌ట్యాంక్ నుంచి ప్రధాన రహదారి వరకు నెలకొన్న రోడ్డు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరగా, ఈ విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా కాలనీవాసులు రామకృష్ణాగౌడ్, గోపాల్‌రెడ్డి, కిషన్‌రావు, హన్మంత్‌రెడ్డి, రాజారత్నం, వెంకటేష్, జగదీశ్వరాచారి, ప్రశాంత్, చిన్న పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

జడ్చర్ల: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు నేరాలు, తదితర సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. బుధవారం బీఆర్‌ఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 'ప్రజా భద్రత-పోలీసు బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు, బాలికల వేధింపులకు గురిచేస్తే కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. అంతకు ముందుకు సురక్ష పోలీసు కళాజాత బృందం మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, షీ టీమ్స్ సభ్యులు పలు సామాజిక సమస్యలపై వివరించారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి

జడ్చర్ల: బాదేపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రహరీ నిర్మాణానికి సంబంధించి విడుదలైన నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని బుధవారం ప్రజా సంఘాల నాయకులు సత్తయ్య, రమేశ్‌నాయక్, కృష్ణయ్య, రంగయ్య, హరిబాబు, తదితరులు పాఠశాల హెచ్ఎంకు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల విహార యాత్రకు సంబంధించి సేకరించిన డబ్బుల్లో అక్రమాలు జరిగాయని తెలిపారు. అక్రమాలపై విచారించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని ఎడల జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

వసతిగృహం తనిఖీ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ అజ్మీరా రాజన్న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు అక్కడి వంట గదిలో సామగ్రి, ఆహార పదార్థాలను పరిశీలించారు. నిద్రించడానికి గదులు సరిపోవడం లేదని, వేడినీటి కోసం గ్లీజర్ ఏర్పాటు చేయాలని, మూడు గదులలో పైకప్పు పెచ్చులూడిపోవడమే గాక వర్షపు నీరు కారుతోందని విద్యార్థినులు వాపోయారు. అనంతరం కుమ్మరివాడిలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు.